ఉపాధి కూలీలకు కష్టకాలం

- 12 వారాలుగా అందని కూలి
- అమలుకాని 100 రోజుల పని


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

దెందులూరు: ఉపాధి హామీ పనులు చేసినా డబ్బులు అందకపోవడంతో కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. చేసిన పనికి 15 రోజుల్లో కూలి చెల్లించాల్సిన సర్కారు ఈ ఏడాది జనవరి రెండో వారం నుంచి చెల్లింపులు నిలిపేసింది. దీంతో కూలీలు కలత చెందుతున్నారు. దెందులూరు నియోజకవర్గంలో మార్చి 19 నాటికి రూ.5.31 కోట్లకుపైగా వేతన బకాయిలు పేరుకుపోయాయి. ఫలితంగా పనులకు కూలీలు దుమ్మాకొడుతున్నారు. నియోజకవర్గంలోని పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాల్లో 10 వేల నుంచి 15 వేల వరకు హాజరయ్యే కూలీల సంఖ్య ఇప్పుడు రెండు వేలకు పడిపోయింది. చేసిన పనులకు ఎప్పుడు డబ్బులిస్తారని మండల స్థాయి అధికారులను అడిగితే ఈ రోజు, రేపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారని కూలీలు వాపోతున్నారు.

పనుల కొరత

వేసవి కాలంలో ఎక్కువగా వ్యవసాయ కూలీలు ఉపాధి పనులకు హాజరవుతుంటారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులున్న గ్రామాల్లో వందల సంఖ్యలో కూలీలు హాజరవుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఆశించిన స్థాయిలో పనులు కల్పించకపోవడంతో కూలీలు అల్లాడుతున్నారు. అధికారులు పనులు కల్పించాలని, చేసిన పనులకు సకాలంలో కూలి చెల్లించాలని కూలీలు కోరుతున్నారు.

అరకొరగా పని దినాలు

గ్రామాల్లో వ్యవసాయ కూలీలు వలసలు నివారించి, ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాలు కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టింది. మరో 10 రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. వేల సంఖ్యలో జాబ్‌కార్డులు పొందిన కుటుంబాలు ఉండగా వంద రోజులు పూర్తి చేసిన కూలీల సంఖ్య నియోజకవర్గంలో మూడంకెలు దాటలేదు. మూడు మండలాల్లో ఈనెల 17వ తేదీకి వందరోజులు పూర్తి చేసిన కేవలం 602 కుటుంబాలే. మార్చి 31 నాటికి ఎన్ని కుటుంబాలు వంద రోజులు పనిదినాలు పూర్తి చేస్తారో, చేసిన పనులకు కూలి ఎప్పుడు చెల్లిస్తారో వేచి చూడాల్సిందే.

మండలం	జాబ్ కార్డులు
పెదవేగి	18,000
పెదపాడు	13,000
దెందులూరు	34,000
100 రోజులు పనిచేసిన కుటుంబాలు	
దెందులూరు మండలం	458
పెదపాడు మండలం	197
పెదవేగి మండలం	177

చెల్లింపులకు చర్యలు



ఉపాధి కూలీల బకాయిలు చెల్లింపులో జాప్యం ఏర్పడింది వాస్తవమే. త్వరలో బకాయిలు చెల్లించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలవుతుండడంతో ఇప్పటికే సెల్ఫ్‌లో ఉన్న పనులుచేస్తున్నారు. కొత్తపనులకు ఎస్టిమేట్లు తయారు చేస్తున్నారు. ఉపాధిపనులు ముమ్మరంగా చేపడతాం.

– ఫాతిమా, ఇన్‌చార్జి ఏపీఓ, దెందులూరు

యాజమాన్య పద్ధతులతో వరిలో తెగుళ్ల నివారణ


పాతూరులో పంట చేలను పరిశీలిస్తున్న అధికారులు, విద్యార్థులు

భీమడోలు: వరిలో ఆకు నల్లి, కాండం కుళ్లు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్రం ఏలూరు సమన్వయకర్త కె.ఫణికుమార్ రైతులకు సూచించారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు గ్రామంలో శనివారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఎన్ఎస్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ అవగాహన, కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ భాగస్వామ్యంపై సదస్సు నిర్వహించారు. తొలుత ఫణికుమార్, శాస్త్రవేత్త ఎన్ నాగేంద్రబాబు, ఏఓ ఎస్‌పీవీ ఉషారాణిల బృందం పంట చేలను పరిశీలించారు. చేలో ఆకు నల్లి, కాండం కుళ్లు తెగుళ్లు ఉన్నట్టు గుర్తించారు. తెగుళ్ల నివారణకు రైతులు పాటించాల్సిన పద్ధతులు, మెలకువలను సిబ్బంది వివరించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వీఏఏ, గ్రామ రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

దెందులూరు: గాలయిగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో వెలసిన భీమ నాగలింగేశ్వర స్వామి ఆలయ ఏడో వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు శర్మ వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి విశిష్ట అలంకరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

ఉపాధి పనుల తనిఖీ


పనులను పరిశీలిస్తున్న పీడీ సుబ్బారావు

దెందులూరు : వడదెబ్బ తగలకుండా కూలీలు త్వరితగతిన పనులు ముగించుకుని క్షేమంగా ఇంటికి చేరాలని జాతీయ ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సుబ్బారావు సూచించారు. శనివారం సానిగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా కూలీలు ఉపాధి పనులు చేయాలన్నారు. ఏపీఓ టెక్నికల్ అసిస్టెంట్లు పనుల నమోదు పర్యవేక్షణ కార్యక్రమాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ ఫాతిమా, టీడీపీ నేత మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), మాజీ సర్పంచ్ ఎలమర్తి శ్రీనివాసరావు, మృత్యుంజయరావు, గ్రామస్తులు ఉన్నారు.

వయోజనులకు నేడు ఉల్లాస్ పరీక్ష


వెలుగు ఏపీఎం అమీరున్నీసా

గణపవరం: గణపవరం మండలంలో వయోజన విద్య ఉల్లాస్ కార్యక్రమంలో శిక్షణపొందిన నిరక్షరాస్యులకు ఈనెల 23న ఆదివారం ఉదయం 10 గంటలకు పరీక్ష నిర్వహించనున్నట్టు వెలుగు ఏపీఎం అమీరున్నీసా తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ పరీక్ష ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఉల్లాస్ అక్షరాశ్యత కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన అభ్యాసకులు 200 మందికి 20 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

బంగారు తాపడం పనులకు విరాళం




ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు ఏలూరు జిల్లాకు చెందిన భక్తులు శనివారం రూ.1.51 లక్షల విరాళం అందజేశారు. పూళ్లకు చెందిన ఎనికేపల్లి శ్రీనివాసరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. శ్రీనివాసరావు బంగారు తాపడం పనులకు రూ.1,51,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

దోబీ ఘాట్లు, విశ్రాంతి భవనాలు నిర్మించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రజకుల విశ్రాంతి భవనాలు, దోబీ ఘాట్ల నిర్మాణం తక్షణమే చేపట్టాలని రజక జన సేవా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా రజక జనసేవా సంఘ స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన రజక నాయకుల సమావేశం నిర్వహించారు. రజకుల వృత్తి చెరువులు బాగుచేయించాలని, హద్దులు నిర్ణయించాలని కోరారు. జీఓ 25 ప్రకారం రజక సంక్షేమ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. రజక వృత్తిపరమైన సమస్యలు పరిష్కరించాలని, రజక మహిళల పట్ల అసభ్యకర కరంగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో నాయకులు చలంతారావుల కృష్ణ, కొమ్మంటి మురళి, సాంబశివరావు, శ్రీనివాసు, శేషు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో జాతర పరిసమాప్తం



ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి ఘటం, మద్దిరామమ్మ సంబరం చేస్తున్న దృశ్యం

భీమడోలు: భీమడోలులో 12 ఏళ్లకొకసారి వచ్చే జాతర మహోత్సవాలు శుక్రవారం రాత్రితో పరిసమాప్తమయ్యాయి. ఈనెల 8, 9 తేదీల్లో గ్రామ దేవతలు మద్దిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజుల జాతర వైభవంగా నిర్వహించారు. మద్దిరామమ్మ ఘటాన్ని ఆలయంలో ప్రతిష్ఠించడంతో జాతర ముగిసినట్టు ఉత్సవ అర్చకులు ప్రకటించారు. జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మద్దిరామమ్మవారి ఘటాన్ని గోదావరి కాల్వలో మంగళ స్నానం చేయించి విశేషంగా అలంకరించి, గ్రామంలో ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాల్చుతూ అమ్మవారి ఘటాన్ని గణాచారులు వేడుకగా ఆలయానికి తీసుకొచ్చారు. గ్రామంలోని మహిళలు పసుపు నీరు పోసి తన భక్తిని చాటుకున్నారు. ఆలయంలో మద్దిరామమ్మకు సంబరం చేశారు. అమ్మవారి ఘటాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో వివిధ విభాగాల్లో పని చేసిన వారిని దత్తాడ శ్రీనివాసరాజు, సభ్యులు సత్కరించారు.

దిశ జిల్లా సభ్యురాలిగా లక్ష్మీసునీత


లక్ష్మీసునీత

ఉంగుటూరు: దిశ కమిటీ జిల్లా మెంబరు గా చేబ్రోలు సర్పంచ్ రాందే లక్ష్మీసునీత ఎంపికయ్యారు. జిల్లాలో 10 మందిని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ఎంపిక చేసి జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేశారని లక్ష్మీ సునీత తెలిపారు. ఆమె ఎంపికపట్ల తోటి సర్పంచులు, గ్రామస్తులు అభినందనలు ప్రకటించారు.

గణపవరం హైస్కూల్ హెచ్‌ఎంగా శర్మ

గణపవరం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం (ఎఫ్ఏసీ)గా గణిత సహాయోపాధ్యాయుడు కేఎస్‌వీఎస్ఆర్ఎస్ శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు డీఈఓ నారాయణ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఎఫ్ఏసీ హెచ్‌ఎంగా ఉన్న కె.పద్మావతి మెడికల్ లీవులో వెళ్లడంతో ఆ స్థానంలో శర్మను నియమించారు.

నీటి సంరక్షణపై అవగాహన అవసరం


నీటి సంరక్షణ సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

గణపవరం: జీవకోటి మనుగడకు నీరు అవసరమని, మంచినీటి వనరులను సంరక్షించుకోవడంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా డిగ్రీ కాలేజీ రసాయన, వృక్ష, జంతు శాస్త్ర విభాగాలు, ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎకోక్లబ్‌ల ఆధ్వర్యంలో నీటి వనరుల సంరక్షణ, వినియోగం, నీటి లభ్యత, ప్రాముఖ్యత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నీటి అతివినియోగం, దుర్వినియోగం, నీటి వనరుల కాలుష్యం, నీటి సంరక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. నీటి ఆవశ్యకతపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. నీటి వనరులను సంరక్షించుకుంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, ఐక్యూఏసీ సమన్వయకర్త చైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

పెదపాడు : మండలంలోని పలు గ్రామాల్లో సురక్షిత తాగునీరు సరఫరాకు రూ.90 లక్షల నిధులు మంజూరు చేసి, ముందస్తు చర్యలు చేట్టామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో చింతమనేని పలు శాఖల అధికారుల పనితీరుపై సమీక్షించారు. 48 గంటల్లో ధాన్యం సేకరణ డబ్బులను రైతుల అక్కౌంట్‌లో జమ చేశామన్నారు. ధాన్యం, అపరాలను కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలో రూ.6.32 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ అమీలు జమా, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టరు లావేటి శ్రీనువాసరావు, నీటి సంఘం డైరక్టరు బొప్పిడి కాశీబాబు, మాజీ ఎంపీపీ మోరు శ్రావణి పాల్గొన్నారు.

దేవుని ఆజ్ఞలకు లోబడి జీవించాలి


ప్రసంగిస్తున్న ఏలూరు పీఠాధిపతి జయరావు, ఫాదర్లు

భీమడోలు: ప్రతి ఒక్కరూ విశ్వాసంతో నిత్య ప్రార్థనలు చేయాలని, దేవుని ఆజ్ఞలకు లోబడి జీవించాలని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పోలిమేర జయరావు సూచించారు. గుండుగొలను ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో ఫాదర్ కాకి చార్లెస్ ఆధ్వర్యంలో నిత్య సహాయ మాత ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన జయరావు వాక్యోపదేశం అందించారు. ఇరుగు పొరుగు పట్ల ప్రేమను కలిగి ఉండాలని, వారికి సహాయ పడుతూ దేవుని దీవెనలు పొందాలని విశ్వాసులకు సూచించారు. నూజివీడు ఆర్‌సీఎం ఫాదర్ ఐ.మైఖేల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆదర్శవంతంగా, ఆధ్యాత్మిక జీవన విధానాన్ని కలిగి ఉండాలన్నారు. ఏలూరు పీఠం వికార్ జనరల్ పి.బాల మాట్లాడుతూ ఉత్సవాల విజయవంతానికి ఫాదర్ ఛార్లెస్, సంఘస్తులు, యువత చేసిన కృషి అభినందించారు. దెందులూరు ఫాదర్ జి.అమ్మన్‌రాజు మాట్లాడుతూ ఐక్యతతో అన్ని సాధించుకోవచ్చునని, సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి జయరావును, వివిధ చర్చిల ఫాదర్లను ఘనంగా సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి పెద్ద విశ్వాసులు, సంఘం పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్మశానంలో చెలరేగిన మంటలు


శ్మశాన వాటికలో దగ్ధమవుతున్న ముళ్ల పొదలు

ఏలూరు (టూటౌన్): స్థానిక మూడో డివిజన్ పరిధిలో ఉన్న హిందూ శ్మశాన వాటికలో శనివారం మధ్యాహ్నం ఎండల తీవ్రతకు మంటలు చెలరేగాయి. చెట్లు, ముళ్ల పొదలు దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన తరలివచ్చిన మంటలను అదుపు చేశారు. మంటలను అదుపు చేయకపోతే సమీపంలోని ఇళ్లకు మంటలు వ్యాపించి పెనుప్రమాదం సంభవించేదని స్థానికులు చెబుతున్నారు. ఫైర్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పాలస్తీనాకు సీపీఎం మద్దతు


మాట్లాడుతున్న సీపీఎం నేత బలరాం

ఏలూరు (టూటౌన్): పాలస్తీనా – గాజాపై ఇజ్రాయేలు దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, పాలస్తీనాకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, మంతెన సీతారాంలు తెలిపారు. సీపీఎం స్థానిక జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్ అధ్యక్షతన పార్టీ ఏలూరు జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ప్రజలు, రైతాంగం, కార్మికుల సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. నాయకులు బలరాం, సీతారాంలు మాట్లాడుతూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ, గాజాపై ఇజ్రాయేలు అమెరికా ప్రోద్బలంతోనే దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. వెంటనే దాడులను ఆపాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు, సెకీ ఒప్పందానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన టీడీపీ కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక సెకీ ఒప్పందాన్ని కొనసాగించడం అదానీ అవినీతిపై రాజీపడినట్టేనని చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ తక్షణమే ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవిలో నీటి ఎద్దడి ఉండే ప్రాంతాల్లో ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ లింగరాజు, జి.రాజు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎం జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు, హనుమాన్లు, కారం భాస్కర్, జి.నరసింహారావు, ఎస్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


చింతలపూడి సబ్‌జైల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి: చింతలపూడి సబ్ జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు శనివారం సందర్శించారు. సబ్ జైల్‌లో ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, వసతి సదుపాయాలను గురించి జైలు అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాలపై అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ హింసా మార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. ఆర్థిక స్తోమత లేక న్యాయవాదిని పెట్టుకోలేని వారి కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతకు ముందు వంటశాలను స్టోర్ రూంను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్ కే అప్పయ్య, పీఎల్‌వీపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రస్తుత పరిస్థితుల్లో తరచూ కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సీఆర్ఆర్ పీజీ కళాశాల డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు యలమర్తి అన్నారు. స్థానిక సీఆర్‌రెడ్డి పీజీ కళాశాల, రవికిరణ్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సీఆర్ఆర్ పీజీ కళాశాలలో ఉచిత కంటి పరీక్ష, అవగాహన సదస్సు నిర్వహించారు. రవికిరణ్ కంటి ఆసుపత్రి డాక్టర్ జి.హేమలత మాట్లాడుతూ చిన్ననాటి నుంచే కంటిపై ప్రత్యేకమైన శ్రద్ధ చూపించాలన్నారు. కంటికి సరైన విశ్రాంతి, తగిన నిద్ర ఉండాలని, జంక్ సంబంధిత ఆహారాలకు దూరంగా ఉంచాలని సూచించారు. అవసరాన్ని బట్టి ఏడాదికి ఒకసారైనా ప్రతి ఒక్కరూ కంటి పరీక్ష చేయించుకొని, డాక్టర్ల సూచనలను పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా సుమారు 120 మందికి కంటి పరీక్షలు చేశారు. పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస రావు, డైరెక్టర్ ఎంబీఏ డైరెక్టర్ రంగు శ్రీనివాసరావు, కార్యక్రమ కో–ఆర్డినేటర్లు తేర రాజేష్, ఎం ఉపేంద్ర, రిటైర్డ్ ఆడిట్ ఆఫీసర్ సత్యనారాయణ, ఐనంపూడి రాంప్రసాద్, అధ్యాపకులు పాలి హేమంత్ సుబ్బారావు, ఎస్ మాధవి, టి.లక్ష్మీ ప్రియాంక తదితరులు అతిథులను ఘనంగా సన్మానించారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రంజిత్‌కుమార్

ఏలూరు (టూటౌన్): బాల బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తణుకు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్ అన్నారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై శనివారం రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం స్థానిక చోదిమెళ్ల అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం బాలబాలికలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, తగు జాగ్రత్తతో నడుచుకోవాలని సూచించారు. జంగారెడ్డిగూడెం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కుమారి కె.రాజరాజేశ్వరి తేజస్వి మాట్లాడుతూ చిన్ననాటి నుంచే మొక్కలు నాటడం, ఇంకుడు గుంటల ఏర్పాటు ద్వారా నీటిని సంరక్షించుకోవచ్చన్నారు. ఏలూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రచన, పాలకొల్లు రెండో అదనపు జూనియర్ జడ్జి పీవీఎస్ఎస్ఎల్ లావణ్య, న్యాయవాది పి.రత్నరాజులు మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రచార జాతా


జాతా కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): సీపీఐ శత వార్షికోత్సవాల నేపథ్యంలో ఈనెల 23 నుంచి ప్రచార జాతా నిర్వహించనున్నట్టు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. శనివారం పార్టీ స్థానిక జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాలకులు అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. 23న ఆదివారం పార్టీ స్థానిక జిల్లా కార్యాలయం నుంచి 36వ డివిజన్ భగత్ సింగ్ విగ్రహం వద్దకు ర్యాలీ, భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం జాతాను పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలో అన్ని మండలాల్లో జాతా కొనసాగుతుందన్నారు. పార్టీ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో విఫలమైందన్నారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు జాత కొనసాగుతుందని చెప్పారు. సమావేశంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, పార్టీ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

ద్వారకాతిరుమల: జి.కొత్తపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సింహాద్రి వెంకటేశ్వరరావు (దాసు) కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేతలు శనివారం నిత్యవసర సరుకులను అందజేశారు. ముందుగా దాసు కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ బిరుదుగడ్డ బజారియ్య, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ఏసురత్నం తదితరులు పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రూ. 1,000 నగదు, 50 కేజీల బియ్యం, 15 కేజీల మంచినూనె, 25 కేజీల ఉల్లిపాయలను దాసు కుమారుడు సుమంత్, సోదరుడు శ్రీనులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పున్నపు కృష్ణ, రాచగర్ల రామకృష్ణ, కొస్సె గంగరాజు, అందుగుల రమేష్, పొంగులేటి సంతోష్, గంజి నాగార్జున, రెడ్డి చిన్ని, బోడ అశోక్, కేశవ, ఊట్ల పండు, భూపతి కన్న, నవీన్, సుబ్బు, దంసెల్లి రమేష్, ఈల్ అఖిల్, బోడ రవి, లక్కాబత్తుల వినోద్, కట్టూరి మంగరాజు తదితరులున్నారు.

విద్యార్థినులకు ఉద్యోగాలు


విద్యార్థినులను అభినందించిన కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాల కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో శనివారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఓటీపీ టెక్నాలజీస్ సంస్థ సీఈఓ జి.హరిబాబు, మేనేజర్ వై.మనోహర్, హెచ్ఆర్ వి.రమాదేవి, హెచ్ఆర్ బృంద సభ్యులు విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు. డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న 131 మందికి తొలుత రాత పరీక్ష నిర్వహించి 40 మందిని ఎంపిక చేశారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి 29 మందిని ఉద్యోగాలకు ఎంపికచేసుకున్నారు. విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ జి.సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీలక్ష్మి, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధి జీఎస్ఆర్ కళ్యాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీలను అందుబాటులోకి తేవాలి

ఉంగుటూరు: రైల్వే గేట్లు రద్దీగా ఉన్న ప్రదేశాల్లో చేపట్టిన ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను త్వరితగతిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. శనివారం ఏలూరులో ఎంపీ పుట్టామహేష్ యాదవ్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ధర్మరాజు పాల్గొన్నారు. ఆ వివరాలను ఎమ్మెల్యే వెల్లడించారు. పూళ్ల, ఉంగుటూరు, చేబ్రోలు, భీమడోలు వద్ద చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. గుండుగొలనుకు ఏలూరు కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించినట్లు వివరించారు.

మత్స్యకారులకు గుర్తింపు కార్డుల పంపిణీ


ఫిషర్మెన్ సొసైటీ సభ్యులకు డిజిటల్ గుర్తింపు కార్డులను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెంలో శ్రీ సీతారామాంజనేయ ఫిషర్మెన్ సొసైటీ అధ్యక్షుడు బంటుమిల్లి బాలకృష్ణ ఆధ్వర్యంలో సొసైటీ సభ్యులకు శనివారం డిజిటల్ ఫొటో గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సయ్య చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మత్స్యకార సొసైటీ సభ్యులకు వివిధ రకాల రాయితీలు, ప్రోత్సాహకాలు, వలలు, సబ్సిడీపై చేప పిల్లలు, ప్రమాద బీమా వంటి సౌకర్యాలను ఈ గుర్తింపు కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ అందజేస్తామన్నారు. మత్సకార సభ్యులు ఐక్యతతో కృషి చేసి మత్స్యసంపదను పెంపొందించాలని కోరారు. అనంతరం మత్యశాఖ అధికారులను సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు మల్లిబోయిన వెంకటేశ్వరరావు, భీమడోలు మత్స్య అభివృద్ధి అధికారి ఎస్ లీలాదుర్గాదేవి, గ్రామ మత్స్య సహాయకుడు రాంబాబు, పిషర్మెన్ సొసైటీ ఉపాధ్యక్షుడు మల్లిబోయిన వెంకటేశ్వరరావు, సెక్రటరీ మాండ్రు వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.